# రామరాజ్యం

పితృవాక్యపాలన కంకణబద్ధుడై, రామభద్రుడు జనకసుత, సౌమిత్రీ వెంటరాగా అరణ్యవాసానికి బయలుదేరాడు

మాతామహుని గేహంనుంచి తిరిగివచ్చిన భరతుడు, కళావిహీనమైన నగర వీథుల్నీ, చిన్నబోయి చిన్నతిరగియున్న అంతఃపుర మందిరప్రాంగణాల్నీ చూసి విస్తుపోయాడు.

మాతృదేవి కైకేయివల్ల తనపట్టాభిషేకమూ .. లోకోత్తరపురుషుడైన రామభద్రుని వనవాసమూ విని ఉగ్రుడై మాతృదేవికి తలమునక్కగా చీవాట్లు పెట్టి రామాన్వేషణార్థియై బయలుదేరాడు. చివరకు రాముని కనుగొనికూడా ఆ మహానుభావుని నిరాకృతి కారణంగా రామపాదుకలను శిరమునదాల్చి అయోధ్యానగరము చేరుకొని పాదుకలను రత్నఖచిత కనకసింహాసనముపై నిల్పి వాటికి ప్రతినిధిగా అయిష్టతతో రాజ్యపాలన కుపక్రమించాడు.

అది ధర్మరాజ్యం! న్యాయధర్మాలు, నాలుగుపాదాలూని నడిచే బహుచల్లనికాలం.

ఒకనాడు సుమంత్రుడు, రాజప్రధానోద్యోగులు భరతునివద్దకొచ్చి "ప్రభూ! ఈ వత్సరం రైతులవద్దనుంచి శిస్తు యేవిధంగా వసూలుచేయమంటారు." అంటూ ప్రశ్నించారు.

భరతుడిదివిని క్షణం నిరుత్తరుడయాడు. చివరకు తెప్పరిల్లి "అమాత్యవర్యా! ఏమిటీ విపరీతం! మీకు నేను చెప్పేపాటివాడనా! కాకున్నా నేను మహారాజునని నా సలహా అడుగుతున్నారా? .కాదు! నాకా అర్హత లేదు! మాతృదేవి చేసిన క్షమించరాని అపరాధానికి అన్నగారు విధించినశిక్షు, ఈ రాజ్యపాలనలోపడి అల్లాడమని! నాకెన్నడు విముక్తి లభిస్తుందో! ఆ మహానుభావుని పాదసేవచేసే మహాద్భాగ్యం యీనీచుడికిలేనందువల్లనే, రామచంద్రుడులేని యీ శ్మశానవాటికలో కొట్టుమిట్టాడుతూండవలసి వచ్చింది" అంటూ కుమిలిపోయాడు భరతుడు.

సుమంత్రునికిగూడ కళ్లనీరు సుళ్లుతిరిగింది.

"ప్రభూ! రామభద్రులు మనకందరకూ పూజనీయులే. కాని వారి వనవాసకారణంగా తాత్కాలికంగా సంక్రమించిన ఈ విశాల రాజ్యభారనిర్వహణాధికారాన్ని పొదలదాల్చి ప్రజాశ్రేయస్సును పరిరక్షించండి! తెలిసినా తెలియకపోయినా యీగురుతర బాధ్యతను మీ భుజస్కంధాలపై మోయక తప్పదు. మీ నోటినుండి వెలువడిన ప్రతివాక్కు మాకు వేదవాక్కు. మీ ఆజ్ఞను శిరసావహించగలం. ఆజ్ఞాపించండి!" అన్నాడు సుమంత్రుడు.

చివరకు భరతుడు గుండె దిటవుపరచుకున్నాడు.

"ఆజ్ఞాపించేశక్తి నాకు లేకపోయినా ప్రజాశ్రేయస్సుదృష్ట్యా, రామభద్రుడే నాచేత పలికిస్తున్నాడనే భావనలో చెబుతున్నాను రైతులనునుగడకు ముప్పురాకుండా రాజోద్యోగులెల్లరు వ్యవహరించండి. శిస్తు ప్రభుత్వమే నిర్ణయించకుండా రైతులు శక్తికొలది యిచ్చినంత గ్రహించడం న్యాయం! అదే శ్రేయస్కరమనుకుంటాను. వ్యవసాయమూ, దాని కష్టనిష్ఠురాలు రైతులకు తెలిసి

## పురాణగాథ

నంత మనకు తెలియవనుకుంటాను! ఏమంటారు?" అన్నాడు భరతుడు.

"మీ యిష్టానువర్తులం!" అంటూ శెలవు పుచ్చుకున్నారు సుమంత్రులాదిగాగల ప్రధానోద్యోగులు.

భరతుడు ఉదారహృదయుడని, దీనజనపోషకుడని కొన్నాళ్ళకే అయోధ్యావాసులకు అవగతమైంది.

'కాతుమెత్తనైన ముక్కాలిపైన్వారి' చేయు అట్లాంటి మనుషులు యీనాటే కాదు ఆనాడూ వున్నారు మరి!

ఆయేడు అయోధ్యానగరంలో పాడిపంటలు వెల్లివిరిశాయి. ప్రతియిల్లూ పచ్చతోరణాలతో కళకళలాడుతూ కనులపండువుగా విలసిల్లింది. రైతుల హృదయకుహరాలలో మోసపుటూహాలు మొలచి చిలువలుపలువలుగా మహావృక్షరూపము దాల్చినాయి.

'రాజు మెత్తనయ్యా! పెత్తనం చలాయించడం చేతకాని అమాయకుడు! అదనుచూచి తెలివిగా వ్యవహరించామా బంగారపుమేడలు కట్టించవచ్చు!" రైతులు రహస్య సమాలోచనలుచేసి తేల్చిన సారాంశమిది.

మరునాడు రైతులు దర్బారులో హాజరయ్యారు.

"ప్రభూ! ఈ సంవత్సరం పంటలు పండడమైతే పండాయి! కాని కోతకాలంలో తెగుళ్లుతగిలి చాలావరకు పైరు నాశనమైంది. ఏదో వచ్చినంతవరకు యింటికి చేరవేశాము! దానిలో శిస్తు ఏమి కట్టాలో, మేము సంవత్సరంపాడుగునా, భార్యాపిల్లలతో ఏమితిని బ్రతకాలో అర్థంగాకుండావుంది! ప్రభువులు కృపాసముద్రులు కావాలంటే శిస్తు తీసివేయగలరు! కాని మామనసు అందుకు అంగీకరించదు. శిస్తు చెల్లిస్తాము!" అన్నారు.

భరతు డిదివిని చాలా విచారించాడు!

"అలాగా! పంట నాశనమైనా తిండిగింజలు శిస్తుగా చెల్లిస్తామని మీ ప్రభుభక్తిని ప్రకటించుకున్నారు. చాలు! ఈ సంవత్సరం శిస్తు ఏమీ యివ్వనక్కరలేదు." అంటూ చెప్పాడు. ప్రధానామాత్యులు నోరు మెదపలేదు. 'పంటలు పండక

శింగంపల్లి అప్పారావు



మద్రాసు టి. యు. సి. ఎస్. బ్రాంచి లన్నింటిలోను ఇప్పుడు లభించును.

# ★ రామరాజ్యం ★

పోలేదు. రైతులు శిస్తు యివ్వదలచుకుంటే యివ్వగలరు. కాని మహారాజు శిస్తు రద్దుచేసినతరువాత మాట్లాడటానికి యింకెవరికేహక్కు లేదు' అనుకున్నారు. ఆనాటి ప్రభుత్వోద్యోగులు అంతటి రాజభక్తిపరాయణులు. న్యాయమైనా అన్యాయమైనా రాజవ్యతిరేకులు కారు.

మరుసంవత్సరం అయోధ్యావాసులు ఉమ్మళ్ళ పాడిపంటలలో మునిగితేలారు.

బహుతక్కువగా ఎవరికితోచినశిస్తువారు ఖజానాకు జమకట్టారు. అడిగేనాథుడు లేడు. అందరూ భరతవాక్యపాలకులు. కిమ్మనలేకపోయారు. రైతుల ఆనందానికి అవధులు లేవు. ఆశకులోబడిన మానవుడు దానిబారినుంచి తప్పించుకోలేడు.

ఏటేటా రైతులు ప్రభుత్వానికి ద్రోహంచేస్తూ, ఒకయేడు తోచినశిస్తు కడుతూ, మరొకయేడు శిస్తు యెగవేస్తూ వచ్చారు.


వారు నివసించేగృహాలు కొన్ని వత్సరాలకే రాజాంతఃపురముల తలదన్నునట్లుగా లేచి నిలచినవి.

## 2

ఘోరమైన పదునాలుగు నిండువత్సరాల అరణ్యవాసం ముగించుకొని, జానకీసౌమిత్రీసహితుడై, వాయుపుత్రుడు, జాంబవంతుడూ మొదలుగాగల వానరసైన్యము వెంటరాగా రామభద్రుడు అయోధ్యానగరానికి పుష్పకవిమానారూఢుడై వచ్చి చేరుకున్నాడు.

హాయిగా ఊపిరిపీల్చి రాజ్యభారాన్ని అన్నగారికి స్వాగతంచేసి, నిశ్చింతుడైనాడు భరతుడు.

వచ్చిన మరునాటినుంచీ రాజకార్య నిమగ్నుడైనాడు రామభద్రుడు! ఏముంది? అర్థికంగా అయోధ్యారాజ్యలక్ష్మి అధోగతిపాలయింది. బొక్కసం వెలితిగా వెక్కిరిస్తున్నట్టు కనిపించింది. ఇదంతా చూడగానే చలిజ్వరంవచ్చినట్టు బాధపడ్డాడు రామచంద్రుడు



ఏ రాజ్యమైనా సగర్వంగా తలయెత్తుకు మనగలగటానికి దాని ఆర్థికశక్తియే హేతుభూతమవుతుంది. రామభద్రుడెంత లీలా మానుషవిగ్రహుడైనా మానవలోకంలో అతను సామాన్య మానవచక్రవర్తి. తదనుగుణంగానే అతనూ వ్యవహరించాలిమరి! నిర్ధనుడైన చక్రవర్తి రాజ్యపాలన సక్రమపద్ధతిలో ఎలా కొనసాగించగలడు? అతను సర్వసమర్థుడు! రామభద్రునికి తెలియని విషయమంటూ లేదు.

వెంటనే ప్రధానోద్యోగులను రావించాడు...

"రాజ్యపాలన మీకు చేతకాలేదని భావించమంటారా! లేక. దేశంలో న్యాయధర్మాలు నామావశిష్టస్థితికి వచ్చాయని విచారించమంటారా! చెప్పండి! ఆర్థికంగా ప్రభుత్వ మెందుకింత బలహీనస్థితికి వచ్చింది! దీనికంతకీ మూలకారణమేమిటి?" రుద్రరూపం ధరించి అరుణారుణ వీక్షణాలు వాళ్లపై ప్రసరిస్తూ మేఘ గంభీరస్వరంతో ప్రశ్నించాడు.

ఆ గంభీరముద్ర చూడగానే ప్రధానోద్యోగులు అచేతనులైపోయారు. ప్రభువు యింత కఠినంగా ప్రశ్నిస్తాడని ఎవరూ కలనైనా తలంచలేదు.

ప్రధానామాత్యులు రైతుల ఆగడమూ, తెనువా, భరతుని మెతకతనమూ, తమ ప్రభువాక్యపాలనా, విన్నవించుకున్నారు.

రామభద్రుడు సంగతి సందర్భాలు క్షణంలో క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నాడు. ఆనాటిరేయి రెండు యామములు గతించగానే మారువేషంలో అయోధ్య యావత్తూ తిరిగి రైతుల సంపత్తినీ, వారి ఊహలనూ, రాజద్రోహాన్నీ అర్థం చేసుకొని తలపంకించి, ఒకింత యోచించి తిరిగి అంతఃపురం చేరుకున్నాడు.

ఆ మరునాడు నగరం మూలమూలలా ఇలా దండోరా వేయించబడింది!

"ఇందుమూలమున తెలియజేయడమేమనగా:— రేపు ఉదయమే శ్రీరామచంద్ర ప్రభువులవారి పట్టాభిషేక మహోత్సవము అతివైభవోపేతంగా జరిపించబడుతుంది కాన చాతుర్వర్ణ్యకులజులు తగువిధమైన కానుకలు తీసుకొని రావలసింది..... ... యుద్ధంలో ప్రభువులవారికి అండదండలుగా నిలిచి, గెలిచి విజయం సాధించిన వానర సైన్య సమూహమునకు గుమ్మడికాయ వంటకము అతిప్రీతిపాత్రమైనది గనుక రైతులు ఒక్కొక్కరూ ఒక్కొక్క గుమ్మడికాయ విధిగా రాజాజ్ఞగా భావించి తీసుకొని రావలసిందిగా కోరడమైనదోహో!" అని.

ఇది విని రైతులు నవ్వుకున్నారు. వారి యిళ్లపై గుమ్మడికాయలు విరగకాసి వున్నాయి.

'ఎవరువచ్చి యాచించినా కొల్లలుగా గుమ్మడికాయలు దానంచేయవచ్చు! పిచ్చి మహారాజుకు ఖచ్చితంగా ఒక్కటేకాయ కావలసివచ్చింది!" అనుకున్నారు రైతులు.

* * *

వల్లెకలా కారుచీకట్లతో రాత్రి ముంచుకొచ్చింది. ఊరు మాటుమణిగింది. ఎల్లరు నిద్రాదేవి ఒడిలో ఉయ్యాలలూగుతున్నారు. అర్ధరాత్రివేళ విచిత్రంగా కొన్ని ఆకారాలు రాజప్రాసాదంనుంచి బయటపడి, అయోధ్యానగరంపై యెగురుతూ యిళ్లపై వాలుతూ చప్పుడు కాకుండా ఏమిటో భీభత్సంచేస్తూ తూరుపు తెలతెలవారుతూండగా అన్నీ కలిసి రాజాంతఃపురం దిక్కుగా యెగిరిపోయాయి!

## 3

తూర్పున సూర్యుడు పొడవకముందే అంతఃపురంనుంచి మంగళవాద్యఘోషలు మిన్నుముట్టినవి. శ్రీరామచంద్రుడు పన్నీట జలకమాడి రాజలాంఛనోపేతమైన ఉడుపులు ధరించి సభాస్థలికి చేరుకున్నాడు.

పట్టాభిషేక మహోత్సవం అనుకున్నట్టు అతివైభవంగా జరిగిపోయింది మంత్రి సామంత, దేశదేశాల ప్రతినిధులతో, ప్రజా సమూహంతో విశాలసభాభవనం కిటకిటలాడుతోంది. తమ ప్రభువుకు ఓపినకొలది ప్రతివారు కానుకలు చదివించి తమజన్మ ధన్యతచెందిందని ఉప్పొంగిపోతున్నారు.

రామభద్రుడు కానుకలవైపు దృష్టి నిగిడించి చూశాడు. కాని అతనికి కావలసిన గుమ్మడికాయలు మాత్రం అందులో కానరాలేదు...వెంటనే సింహాసనంనుంచి లేచాడు...సభాస్తారులు మంత్రముగ్ధులవలె చప్పుడుచేయకుండా ఆ లీలామానుషవిగ్రహునివైపు చూస్తూ, హటాత్తుగా ప్రభువు లేచిన కారణమేమిటో తెలియక ఆశ్చర్యమనస్కులయ్యారు.

"ప్రజలు, ప్రభుత్వోద్యోగులు నాయందు ఇంత రాజభక్తిని ప్రదర్శిస్తున్నందుకు చాలా సంతోషంగావుంది. కాని ఘోరరాక్షస సంగ్రామంలో యెనలేని శౌర్యప్రతాపాలు ప్రదర్శించి నాకు విజయంచేకూర్చిన వానర సైన్యానికి ప్రీతికరమైన గుమ్మడికాయలు యిందు కనిపించడంలేదు. చాల్లా శోచనీయమైన విషయం! ఇది ప్రధానవిషయంగా పరిగణించమని చాటింపుకూడ వేయించబడింది! మరి రైతుల అలక్ష్యానికి హేతువేమిటో అనూహ్యం! వారు రాజశాసనోల్లంఘన చేశారు! ఈప్రథమనిందితులైన యీ రైతులకు న్యాయశాస్త్రదృష్ట్యా యేదండన విధించాలో యీ సభలోనే నిర్ణయించబడుతుంది." అన్నాడు శ్రీరామచంద్రుడు గంభీరంగా.

ఏమి ఉపద్రవం ముంచుకొస్తుందోనని అరచేత ప్రాణాలుపెట్టుకున్న రైతులు యిది వినగానే గడగడలాడిపోయారు.

వారంతా వినయంగా చేతులుకట్టుకొని ముందుకువచ్చి "మహాప్రభూ! మావల్ల ఏమాత్రం దోషంలేదు! విరగకాసివున్న గుమ్మడికాయలు విచిత్రంగా తెల్లవారేసరికి మచ్చుకు ఒక్కకాయగూడలేకుండా ధ్వంసమైపోయాయి ఎక్కడైనా వెదకి తీసుకువద్దామన్నా దేశమే గొడ్డుపోయింది ప్రభూ! ఒక్కరాత్రిలో యింతటి అల్లకల్లోలం ఎలా జరిగిందో వూహించ శక్యంగాకుండావుంది! మన్నించండి! కావలిస్తే ప్రభువులకు గుమ్మడికాయతో సరితూగగల బంగారమైనా యివ్వగలంకాని గుమ్మడికాయలే తీసుకురావడం మావల్లకాదు! ఆతరువాత ప్రభువులు ఏ శిక్ష విధించినాసరే! ధనగర్వాన్ని ప్రదర్శిస్తూ ఎంతో దర్పంతో అన్నారు.

"ఏమిటీ! గుమ్మడికాయతో సరితూగగల బంగారాన్ని యివ్వగలరా!" అన్నాడు రామభద్రుడు ఆశ్చర్యంతో.

"చిత్తం! యివ్వగలం! లేకపోయితే మీరు విధించే శిక్షకు పాత్రులం!" అన్నారు

"అయితే సరే! అలాగే యివ్వండి! ఆ ధనంతో, ప్రపంచంలో ఎక్కడున్నావరే






# రామరాజ్యం

గుమ్మడికాయలను తెప్పిస్తాం! ఒక్క ముఖ్య విషయం. గుమ్మడికాయబరువుకు అవగింజంత బంగారంకూడ తగ్గకూడదు! సుత్తుంచుకోండి!" అన్నాడు రామచంద్రుడు.

బంగారాన్ని మణుగులకొద్దీ దాచివుంచిన రైతులు ప్రభువు అంగీకరించినందుకు సంతోషిస్తూ యిళ్లకు పరుగెత్తారు. అంతఃపురోద్యానంలో పండిన ఒక్క గుమ్మడికాయనూ విశాలమైన త్రాసునూ తెచ్చి సభాభవన మధ్యంలో అమర్చారు భటులు.

రైతులు తమ తమ బంగారాన్ని పట్టించుకు వచ్చారు. త్రాసులో ఒకవైపు గుమ్మడికాయ వున్నది. ఒక రైతు తనవంతు బంగారాన్ని త్రాసులో వేశాడు. వీసమెత్తుకూడ త్రాసు చలించలేదు!. ఇక చెప్పేదేముంది? ఈశ్వరాంశసంభూతుడైన వాయుపుత్రుడు గుమ్మడికాయలో ప్రవేశించాడాయె! ఇంకేం కదులుతుంది! ఒక్క రైతుకాదు... అయోధ్యలోని రైతులందరు తమతమ బంగారాన్నంతటనీ తెచ్చి త్రాసులో వేశారు.. సంపద యావత్తూ కరిగించి తెచ్చి పడేశారు... కాని త్రాసు కదల నన్నట్టుగా భీష్మించుకు కూర్చుంది. రైతులంతా కలిసి కనీసం ఒక్క గుమ్మడికాయబరువుకు తగిన బంగారమైనా యిద్దామని శాయశక్తులా ప్రయత్నం చేశారు. కాని ఫలితం కనిపించలేదు! రైతులు ఆశ్చర్యంతో నోళ్లు వెళ్ళబెట్టారు.

చివరకు చేయగలిగినదేమీ లేక వినయంగా చేతులు జోడించి "ప్రభూ! ఇక మా వద్ద పూచికపుల్లకూడా లేదు. మణుగులకొద్దీ తెచ్చి తూచినా లాభం లేకపోయింది. చూడగా యిదంతా ఏదో మాయగావుంది! ఇక మా వల్లగాదు" అన్నారు.

రామభద్రునికి కోపం ముంచుకు వచ్చింది! "అవును యిది మీ వల్లగాదు రాజద్రోహం చేయడం మీ వల్లనవుతుంది! ధర్మపథాన నడిచే సామ్రాజ్యానికి కళంకమాపాదించడం మీ వల్లనవుతుంది! ధనమదాంధతలో కన్నూ మిన్నూ గానక రాచమర్యాదనే రచ్చకెక్కించడం మీ వల్లనవుతుంది! అధర్మవర్తనులారా! రాజ్యలక్ష్మి గౌరవప్రతిష్ఠలకే ముప్పు తెచ్చారు. ఇది మొదటి తప్పిదంగా భావించి ఇంతటితో మిమ్ము క్షమించి విడిచిపెడుతున్నాను ఇకముందు బుద్ధిగా మెలగండి, పొండి" అంటూ ఆజ్ఞాపించాడు.

ఆ తరువాత సభాసదుల నుద్దేశించి "వకాశం దొరికిందని అధర్మానికి పూనుకోవద్దు. ధర్మనిరతులై నీతిమార్గాన్ని అనుసరించండి! నా పాలనలో ధర్మం వర్ధిల్లుతుంది-న్యాయం, వర్ణభేదము లేకుండా పాటించబడుతుంది. నీతి న్యాయ ధర్మాలు, కొనసాగినంతకాలం సామ్రాజ్యం అవిచ్ఛిన్నంగా, వెలుగొందుతుంది!" అంటూ శ్రీరామచంద్రుడు ఆ నాటికి సభ చాలించి అంతఃపురానికి వెళ్ళిపోయాడు! ★